నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 28 డిసెంబర్ 2024 | SANGAREDDY

స్వామివారి కల్యాణం జరిగే ప్రదేశంలో ఏర్పాటు చేసిన షామియానాలు

రేపు కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- భారీగా తరలిరానున్న భక్తులు
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ
- హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- భారీ ఏర్పాట్లు చేస్తున్న ఆలయ వర్గాలు

చేర్యాల, డిసెంబర్ 27: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరుకానున్నారు. ఇప్పటికే ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. మంత్రులు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వరుడు మల్లికార్జున స్వామి తరపున పడిగన్నగారి వంశస్తులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవీ తరపున మహాదేవుని వంశస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపిస్తారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు కొమురవెల్లి క్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోటబావి వద్ద గల కల్యాణ వేదికలో 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య స్వామి ఆధ్వర్యంలో వేద పర్యవేక్షణలో కల్యాణం జరగనున్నది. ఉత్సవాలు రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు.ఆదివారం వేకువజామున 5గంటలకు స్వామి వారికి దిష్టికుంభం(బలిహరణం),10.45 గంటలకు స్వామి కల్యాణం, మధ్యాహ్నం 12గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 7గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 9గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అనంతరం మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వేలాదిగా తరలి రానున్న భక్తులు

మల్లన్న కల్యాణోత్సవానికి 30వేల వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణ వేదిక తోటబావి ప్రాంతంలో నిర్మించిన శాశ్వత కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, షామియానాలు, పచ్చదనం ఉట్టిపడే విధంగా పలు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ వేదిక వద్ద మరో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నూతన క్యూలైన్ల నిర్మాణం చేపట్టడడంతో రాజగోపురం వద్ద చలువ పందిళ్లతో తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. నూతనంగా నిర్మించిన భవనంలో ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 60వేల లడ్డూ ప్రసాదాలు, 5 క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లను తయారు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔటసోర్సింగ్ సిబ్బంది మొత్తం 70 మంది, 100 మంది వలంటీర్లు విధులు నిర్వహించనున్నారు. పలువురు ప్రభుత్వశాఖల అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 300 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు.

షీ టీమ్స్‌పై విద్యార్థినులకు అవగాహన

ముత్తంగిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఆసిఫ్

పటాన్‌చెరు, డిసెంబర్ 27: విద్యార్థినుల భద్రతకు షీ టీమ్స్ నిరంతరం బాధ్యతతో పనిచేస్తాయని పటాన్‌చెరు ఎస్సై ఆసిఫ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మాజ్యోతిబాపూలే కళాశాల, స్కూల్‌లో పోలీస్‌శాఖ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఆకతాయిల నుంచి ఎలా కాపాడుకోవాలో పోలీసులు వివరించారు. మీ భద్రతకు పోలీస్ శాఖ షీటీమ్స్‌ను తెచ్చిందన్నారు. బాలికలకు, యువతుకు, మహిళలకు రక్షణ కల్పిస్తుందన్నారు. బయటకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలను ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరుగుతున్న గుట్టలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో జోరుగా మట్టి అక్రమ దందా

- గుట్టలపై కన్నేసిన అక్రమార్కులు
- రిజర్వాయర్లు,ప్రధాన కాల్వల నుంచి మట్టి అక్రమ తరలింపు
- రాత్రివేళల్లో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు
- పేరుకే టాస్క్‌ఫోర్స్‌లు..చర్యలు శూన్యం

సిద్దిపేట శివారులోని రంగనాయక సాగర్ నుంచి మల్లన్న సాగర్‌కు వెళ్లే ఓపెన్ కెనాల్ వద్ద మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు

సిద్దిపేట, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మామూళ్లకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు అందినా నామమాత్రపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నారనే అపవాదు ఉంది. పైసా పెట్టుబడి లేకుండా అధికారులను మచ్చిక చేసుకొని మూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమార్కులు మట్టి దందాను కొనసాగిస్తున్నారు. రోజురోజుకూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అవసరమైతే భౌతిక దాడులకు దిగుతున్నారు. ఈ చీకటి దందా సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జోరుగా కొనసాగుతున్నా యంత్రాం గం గట్టి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో జోరుగా మట్టి దందా.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని నియోజకవర్గాల్లో మట్టి దందా కొనసాగుతున్నది. ఈ దందా వెనుక కొంత మంది అధికార పార్టీ నేత ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా జిల్లాలో ఉన్న గుట్టలను, ఏనేలను అక్రమార్కులు ఎంచుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలలలోని దుద్దెడ, తిమ్మారెడ్డిపల్లి, కుకునూర్ పల్లి, సిద్దిపేట శివారు ప్రాంతాల నుంచి, వర్గల్, కోహెడ, బెజ్జంకి, చిన్నకోడూరు మండలాలతో పాటు కొమురవెల్లి మండలాల నుంచి ఎక్కువ మొత్తంలో మట్టిని తరలిస్తున్నారు.సంగారెడ్డి, పటాన్ చెరు, జహీరాబాద్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో అక్రమ మట్టిదందా జోరుగా కొనసాగుతున్నది. రాత్రివేళల్లో జేసీబీలతో టిప్పర్లలో మట్టిని నింపి తరలిస్తున్నారు. రాత్రివేళ వీటిని అడ్డుకోవడానికి వెళ్లిన వారిపై భౌతికదాడులకు దిగుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల వద్ద ఉన్న మట్టిని రాత్రిపూట యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రాజెక్టు మట్టి తరలింపు కొంత మంది నీటి పారుదల శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అక్రమార్కులు రెచ్చి పోతున్నారు.

గుట్టలపై కన్నేసిన అక్రమార్కులు

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని గుట్టలను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. జిల్లాలోని జాతీయ రహదారులు, పరిశ్రమలు, రిజర్వాయర్లు ఉన్నాయి. వీటితో జిల్లాలోని భూములకు మంచి డిమాండ్ ఉంది. ప్రధానమైన పట్టణాల్లో ఇంటి నిర్మాణాలతో పాటు వెంచర్లకు మట్టి అవసరాలు పెరిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని మట్టి దందాను నడిపిస్తున్నారు. ఇటీవల ఇంటి నిర్మాణాలు పెరిగాయి.దీంతో మట్టి అవసరాలు బాగా పెరిగాయి. ఇదే అదునుగా మట్టి ధరలను ఇష్టారీతిగా పెంచేస్తున్నారు. స్థానికంగా ఉన్న గుట్టలను, రిజర్వాయర్లు నిర్మించిన వద్ద ఉన్న మట్టిపై అక్రమార్కులు కన్నేసి దానిని రాత్రి వేళల్లో తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ 3వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. మట్టి రకాన్ని బట్టి రేటును నిర్ణయిస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న రైల్వే ట్రాక్, జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి.వీటి అవసరాలకు మట్టిని అధికారికంగా తరలిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకొని వాటి పేరు మీద కొంతమంది అధికారుల అండదండలతో అక్రమార్కులు మట్టి దందా నడిపిస్తున్నారు. ప్రభుత్వం అనుమతించిన టిప్పర్లకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు మట్టిని తరలించాలి. కానీ, ఇదే అదునుగా చేసుకొని కొందరు అక్రమార్కులు రాత్రివేళల్లో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ రాత్రివేళల్లో దందా సాగుతోంది.ప్రభుత్వ, ప్రైవేట్ తవ్వకాలకు సంబంధించి రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న తర్వాత జిల్లా మైనింగ్ అధికారుల అనుమతి పొందా ల్సి ఉంటుంది. కానీ, క్షేత్రస్థాయిలో ఇలా జరగడం లేదు.

అక్రమార్కులకు అధికారుల అండదండలు..?

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా జరుగుతున్న మట్టి దందాలో రెవెన్యూ, మైనింగ్, నీటి పారుదల శాఖ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీరితో పాటు పోలీస్ శాఖ అక్రమార్కులకు పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు ముందే అధికారులకు రేటు ఫిక్స్ చేస్తున్నారు. టిప్పర్‌కు ఇంత ఇవ్వాలి అని లెక్క ఉంటుంది. ఆ లెక్క ప్రకారం వాటాలను అధికారులకు అందిస్తున్నారు. ఒకవేళ అధికారి వినకపోతే బడా నేతలు రంగంలోకి దిగుతున్నారు. నయానో బయానో వారిని ఒప్పిస్తున్నారు. లేకపోతే బెదిరింపులకు దిగుతున్నారు. మట్టి దందాలో అందరికీ వాటాలు పోతున్నాయి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల వద్ద, ప్రధాన కాల్వల మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీనికి కొందరు అధికారులు అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది చేత టిప్పర్లను కొనిపించి వారితో దందాను అధికారులే చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా జరుగుతున్నా ఉన్నతస్థాయి అధికారుల చర్యలు మాత్రం శూన్యం. పేరుకు మాత్రమే టాస్క్‌ఫోర్స్‌లు తప్పా పెద్దగా ప్రయోజనం లేదన్న విమర్శలు ఉన్నాయి.

సంగారెడ్డి పోలీస్ కార్యాలయంలో వార్షిక నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

మత్తుపై ఉక్కుపాదం

- పెరిగిన నేరాలు, మాదకద్రవ్యాల కేసులు
- తీవ్ర కేసులు 32 శాతం, లైంగికదాడి కేసులు 31 శాతం పెరుగుదల
- 83 శాతం పెరిగిన కిడ్నాప్, 112 శాతం పెరిగి దోపిడీ కేసులు
- గతేడాది పోలిస్తే సంగారెడ్డి జిల్లాలో పెరిగిన హత్యలు, దోపిడీ కేసులు
- తనిఖీల్లో వాహనదారులపై రూ.7.78 కోట్ల జరిమానాల విధింపు
- డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.1.13కోట్ల జరిమానాలు, 65 మంది జైలు
- గణనీయంగా పెరిగిన సైబర్ నేరాలు
- ఆర్థికనేరాల్లో రూ.47.21కోట్లు మాయం
- విలేకరుల సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్
- వార్షిక నేరాల నివేదిక వెల్లడి

సంగారెడ్డి, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో 2024లో తీవ్ర నేరాలు పెరగడంతో పాటు మాదకద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణా కేసులు పెరిగాయని, వాటిపై కఠినంగా వ్యవహరించామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక నేరాల నివేదిక వివరాలను మీడియాకు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో నేర కేసులు 5శాతం మేర పెరిగినట్లు చెప్పారు. గతేడాది జిల్లాలో 7236 కేసులు నమోదు కాగా, ఈసారి 7563 కేసులు నమోదైనట్లు చెప్పారు. ప్రస్తుత సంవత్సరంలో తీవ్ర నేరాలు 32శాతం పెరిగినట్లు వివరించారు. గతేడాది జిల్లాలో 215 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 283 కేసులు నమోదైనట్లు తెలిపారు. సాధారణ నేర కేసులు గతేడాది 7021 నమోదు కాగా, ప్రస్తుతం 7280 కేసులు నమోదైనట్లు చెప్పారు. సాధారణ కేసులు ఈసారి 4శాతం పెరిగినట్లు తెలిపారు. హత్య కేసులు 4శాతం పెరిగినట్లు తెలిపారు. గతేడాది జిల్లాలో 53 హత్య కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 55 కేసులు నమోదైనట్లు చెప్పారు. గతేడాది ఆస్తి కోసం 5 హత్యలు జరగగా, ఈసారి 10 కేసులు నమోదైనట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి రవాణా కేసులు జిల్లాలో పెరిగినట్లు తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, గంజాయి సాగుకు సంబంధించి గతేడాది 11, ఈ ఏడాది 34 కేసులు నమోదైనట్లు చెప్పారు. గతేడాది 5 గంజాయి కేసులు , ఈసారి 26 కేసులు నమోదైనట్లు వివరించారు. హెరాయిన్, నల్లమందు కేసులు 4, గంజాయి సాగు కేసులు 4 నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో 508.71 కేజీల గంజాయి, 14.03 కేజీల హెరాయిన్, హాష్ ఆయిల్, నల్లమందు సీజ్ చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది సైబర్ నేరాలు గణనీయంగా పెరిగినట్లు చెప్పారు. గతేడాది 323, ఈసారి 793 సైబర్ కేసులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు రూ.47.84 కోట్లు కోల్పోయినట్లు చెప్పారు. సైబర్ నేరాల అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రూపేశ్ వివరించారు. ఇందుకోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసుల చర్యతో సైబర్ నేరగాళ్ల నుంచి రూ.5.90 కోట్లు హోల్డ్ చేశామన్నారు. వచ్చే ఏడాది మాదకద్రవ్యాలు, గంజాయి సాగు రవాణాపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు.

మహిళలపై పెరిగిన నేరాలు

గతేడాదితో పోలిస్తే ఈసారి మహిళలపై నేరాలు పెరిగినట్లు ఎస్పీ వెల్లడించారు. లైంగికదాడి కేసులు 31శాతం పెరిగినట్లు చెప్పారు. గతేడాది 100 లైంగికదాడి కేసులు నమోదు కాగా, ఈసారి 131 నమోదైనట్లు వివరించారు. మహిళల హత్యలకు సంబంధించి ఈఏడాది 17 కేసులు నమోదైనట్లు తెలిపారు.మహిళల కిడ్నాప్ కేసులు గతేడాది 39 నమోదు కాగా, ఈఏడాది 75 నమోదైనట్లు వివరించారు. వరకట్నం వేధింపులతో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో మహిళలపై నేరాలు అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కిడ్నాప్‌లు, దోపిడీ కేసులు

జిల్లాలో గతేడాదితో పోలిస్తే కిడ్నాప్‌లు, దోపిడీ కేసుల సంఖ్య పెరిగినట్లు ఎస్పీ తెలిపారు. దోపిడీ కేసులు ఈసారి 112శాతం పెరిగినట్లు చెప్పారు. గతేడాది దోపిడీ కేసులు 17 నమోదు కాగా, ఈసారి 36 కేసులు నమోదైనట్లు వివరించారు. రాత్రిపూట చోరీలు ఈసారి 9శాతం పెరిగినట్లు చెప్పారు. గతేడాది రాత్రిపూట చోరీలు కేసులు 197 నమోదు కాగా, ప్రస్తుత సంవత్సరం 215 నమోదైనట్లు తెలిపారు. సాధారణ చోరీలు సైతం 52శాతం పెరిగినట్లు వివరించారు. గతేడాది 420 చోరీల కేసులు నమోదు కాగా, ఈసారి 639 నమోదైనట్లు చెప్పారు. గతేడాది గొలుసు చోరీ కేసులు 15 నమోదు కాగా, ఈసారి ఆ సంఖ్య 21కు చేరినట్లు వివరించారు. చోరీ కేసుల్లో రికవరీ సొత్తు పెరిగినట్లు తెలిపారు. గతేడాది 26శాతం రికవరీ కాగా, ఈసారి 49శాతం సొత్తు రికవరీ చేసినట్లు చెప్పారు. 2024లో మొత్తం రూ.7.55 కోట్లు ఆస్తిని కోల్పోగా, ఇందులో రూ.3.73 కోట్ల సొత్తు రికవరీ చేసి యజమానులకు అప్పగించినట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాలు 3శాతం పెరిగినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య, గాయపడిన వారి సంఖ్య తగ్గినట్లు చెప్పారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 852 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, అందులో భారీ రోడ్డు ప్రమాదాలు 365 నమోదైనట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో 384 మంది మృతి చెందగా, 913 మంది తీవ్ర గాయాల పాలైనట్లు చెప్పారు. వాహనాల తనిఖీ, డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు పెద్దఎత్తున నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. 2024లో వాహనాల తనిఖీలకు సం బంధించి 1,94,888 కేసులు నమోదు చేసి రూ.7.78 కోట్లు జరిమానాలు విధించినట్లు తెలిపారు. వాహనాల తనిఖీ సమయంలో డ్రంకెన్ డ్రైవ్‌కు సంబంధించి 8676 కేసులు నమోదు చేసి రూ.1.13 కోట్ల జరిమానాలు విధించినట్లు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 65 మందికి జైలు శిక్ష పడినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో 179 చీటిం గ్ కేసులు, 17 నమ్మకద్రోహం కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 105 పేకాట కేసులు, 13 మట్కా కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

మా టీచర్లు మాకే కావాలి

చేర్యాల కస్తూర్బా విద్యాలయం ఎదుట విద్యార్థినుల బైఠాయింపు

చేర్యాల కేజీబీవీ ఎదుట బైఠాయించిన బాలికలు

చేర్యాల, డిసెంబర్ 27: చేర్యాలలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం విద్యార్థినులు తరగతి గదులు వదిలి విద్యాలయం ఎదుట భైఠాయించారు. కొన్ని రోజులుగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట దీక్షలు కొనసాగిస్తున్నారు. దశల వారీగా దీక్షలు చేపట్టిన ఉద్యోగులు శుక్రవారం నుంచి పూర్తి స్థాయి ఆందోళనకు దిగారు.దీంతో కేజీబీవీలో పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం తీసుకువచ్చి కేజీబీవీ విద్యార్థినులకు పాఠాలు చెప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయం తెలిసి విద్యార్థినులు శుక్రవారం తరగతి గదులు వదిలి ఆందోళనకు దిగారు. ఇప్పటి వరకు తమకు పాఠాలు బోధించిన టీచర్లనే నియమించాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల హామీలు నెరవేర్చాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించి తమ చదువులు కొనసాగేలా సీఎం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థినుల ఆందోళన తెలిసి ఎంఈవో రచ్చ కిష్టయ్య కేజీబీవీకి వచ్చి విద్యార్థినులను సముదాయించే ప్రయత్నం చేయగా, వారు ససేమిరా అన్నారు. కొన్ని గంటల పాటు విద్యార్థినుల నిరసన కొనసాగింది. కాంగ్రెస్ సర్కారు వెంటనే స్పందించకపోతే తాము సైతం ఆందోళన చేపతామని విద్యార్థినులు హెచ్చరించారు.

పెరిగిన నేరాలు

- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 5 శాతం పెరిగిన క్రైమ్ రేట్
- 2024లో 6,233 కేసులు నమోదు
- గతేడాదితో పోల్చితే పెరిగిన 302 కేసులు
- 2025లో డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి ప్రాధాన్యం
- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదిక విడుదల

సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయం

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 27: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 2024 వార్షిక నివేదికను సీపీ అనురాధ శుక్రవారం విడుదల చేశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2024లో నేరాలు 5శాతం పెరిగాయి. గతేడాది 5931 కేసులు నమోదు కాగా, ఈసారి కేసుల సంఖ్య 6233కు పెరిగింది. 2024లో 25 మర్డర్ కేసులు నమోదైతే, 2023లో 13 కేసులు నమోదయ్యాయి. ఈసారి దొంగతనాల కేసులు 709 కేసులు నమోదు కాగా, 31,097,968 సొమ్ము దొంగలించ బడింది. ఇందులో 40,2023 శాతం రికవరీ చేశారు. గతేడాది 670 కేసులు చోరీ కేసులు నమోదయ్యాయి. దొంగలించబడిన సొత్తు 37,385,833 కాగా, రికవరీ 43 శాతం ఉంది. ఈసారి కేసుల డిటెక్షన్ పర్సంటేజ్ 60 శాతం ఉంది. గతేడాది 89 పోక్సో కేసులు నమోదు కాగా, ఈసారి ఆ సంఖ్య 91కి చేరింది. గతేడాది 73, ఈసారి 75 లైంగికదాడి కేసులు నమోదయ్యాయి.ఈసారి 9, గతేడాది 5 చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ఈసారి 655 రోడ్డు ప్రమాదాలు జరిగి 283 మంది చనిపోయారు. 561మంది గాయపడ్డారు. 2023లో 540 రోడ్డు ప్రమాదాల్లో 260 మంది చనిపోయారు. 480 మంది గాయపడ్డారు. ఈసారి డ్రంకెన్ డ్రైవ్ కేసులు 12,681 నమోదు చేసి 45 మందిని జైలుకు పంపారు. 2023లో 9713 కేసులు నమోదు చేసి 28 మందికి జైలుకు పంపారు. ఈసారి 40, 2023లో 14 గంజాయి కేసులు నమోదయ్యాయి. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై 156 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. రాజీవ్ రహదారిపై అతివేగంగా వెళ్లే వాహనాలను స్పీడ్ లేజర్ గన్ ద్వారా గురించి 2024లో 43,593 కేసులు నమోదు చేసి 45,076,390 జరిమానా విధించారు. 2023లో 86,533 కేసులు నమోదు చేసి 8,95,27,414 జరిమానా విధించారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల్లో నేరస్తులకు గతేడాది 47శాతం శిక్షలు విధింటగా, ఈసారి 48శాతం విధించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 219 కేసులు నమోదు చేసి, 412 మందిని అరెస్ట్ చేశారు. 2023లో ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. ఈసారి క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్ కేసులు 562 నమోదయ్యాయి. 2023లో 537 కేసులు నమోదు చేశారు. 2023-2024లో 199 సైబర్ కేసులు నమోదు చేసి, 69,61,586 డబ్బులు ఫ్రీజ్ చేశారు. రెండేండ్లు కలిపి బాధితుల ఖాతాల్లో రూ.80,58,718 జమ చేశారు. ఈసారి జూదం, పేకాట ఆడిన వారిపై 80కేసులు నమోదు చేసి, 511 మందిని అరెస్ట్ చేసి రూ.17,34,968 సీజ్ చేశారు. 2023లో 26 కేసులు నమోదు చేసి, 162 మందిని అరెస్ట్ చేసి రూ.8,51,895 సీజ్ చేశారు. ఈసారి 100 డయల్ కాల్స్ 41,582 వచ్చాయి. ఈ ఏడాది 9255 పాస్‌పోర్టు విచారణ చేశారు. ఈసారి పెట్టీ కేసులు 3150, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 1421 కేసులు నమోదు చేశారు. నిషేధిత గుట్కా, పాన్ పరాగ్, జర్దా విక్రయాలపై 32 కేసులు నమోదు చేశారు. 2023లో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. ఈ ఏడాది నకిలీ, కల్తీ విత్తనాలకు సంబంధించి 3 కేసులు నమోదు చేశారు. 2023లో 1 కేసు నమోదైంది. ఈసారి బెల్ట్ షాప్‌లపై 404 కేసులు నమోదు చేశారు. 2023లో 369 కేసులు నమోదు చేశారు. చోరీ చేసిన ఫోన్లు ఈసారి 1369 స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. 2023లో 293 ఫోన్లు బాధితులకు అప్పగించారు. జాతీయ మెగాలోక్ అదాలత్‌లో 21,249 కేసులు, 2023లో 6790 కేసులు పరిష్కరించారు. ఈసారి 3,45,816 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు, 2023లో 4,89,016 కేసులు నమోదు చేశారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఈసారి 145, గతేడాది 11 కేసులు నమోదయ్యాయి. 2025లో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడంతోపాటు సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

ఇటీవల ఎన్కెమూరి పత్తి మిల్లులో క్రిస్మస్ సెలవు ఉన్నప్పటికీ ఖాళీ అవుతున్న పత్తి

పత్తి మిల్లుల్లో దళారుల దందా

- రైతుల వద్ద దోచుకుంటున్న మిల్లు యాజమాన్యం
- తేమశాతంలో అక్రమాలకు పాల్పడుతున్న సీసీఐ సిబ్బంది
- సెలవు ఉన్నా దళారుల నుంచి కొనుగోళ్లు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

కంగ్టి, డిసెంబర్ 27: రైతులకు అందుబాటులో ఉంటూ వారి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లో పత్తిమిల్లుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. దీనినే ఆసరాగా భావించిన పత్తిమిల్లు యాజమాన్యం రైతులను పట్టించుకోకుండా దళారులను ఆశ్రయించి వారినుంచి పత్తిని కొనుగోలు చేసి రైతులకు శఠగోపం పెడుతున్నది. రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన పత్తిని ఏదో వంక పెట్టి వెనక్కిపంపిస్తున్నది. దీంతో రైతులు దిక్కుతోచక తాము పండించిన పత్తిని దళారులకే విక్రయిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో మూడు పత్తి మిల్లులు ఉన్నాయి. ఎన్కెమూరి గ్రామశివారులో ఉన్న పత్తిమిల్లు పూర్తిగా దళారులకు అడ్డాగా మారింది. కంగ్టి మండల దళారులే కాక కామారెడ్డి జిల్లాకు చెందిన దళారులు సైతం రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని ఇక్కడ విక్రయిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని వారి వద్ద నుంచి పంటపాస్‌బుక్, ఆధార్‌కార్డులు సేకరించి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసి కమీషన్ తీసుకుంటున్నారు.దీనికి పత్తిమిల్లు యాజమాన్యం సైతం మద్దతు లభించడంతో వారి వ్యాపారం సాఫీగా సాగుతున్నది. దీంతో దళారులు, పత్తిమిల్లు యాజమాన్యం, సీసీఐ సిబ్బంది లాభపడగా రైతులు మాత్రం నష్టపోతున్నారు.

రైతుల వద్ద దోచుకుంటున్న యాజమాన్యం

బాసటగా నిలవాల్సిన యాజమాన్యం దళారులకు పెద్దపీట వేయడంతో అసలైన రైతులు నష్టపోతున్నారు. రైతులకు చెందిన పత్తి వాహనాలు మిల్లుకు వస్తే వాటిని గంటల తరబడి వేచిఉండేలా చేస్తున్నారు. దీంతో వారు రోజులపాటు మిల్లువద్దే ఉండక తప్పడం లేదు. అదే దళారులకు చెందిన పత్తి డీసీఎం, లారీల్లో వస్తే వెంటనే బండ్లు ఖాళీ అవుతున్నాయి. వారి అక్రమాలు రైతుల కండ్లముందే జరుగుతున్నాయి. సీసీఐ సిబ్బంది సైతం మిల్లుయాజమాన్యానికి వత్తాసు పలకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తేమశాతంలో అక్రమాలు..

రైతులు విక్రయించడానికి మిల్లుకు తెస్తున్న పత్తి తేమశాతంలో అక్రమాలు జరుగుతున్నాయి. రైతుకు చెందిన పత్తి 8శాతం ఉంటున్నప్పటికీ సీసీఐ సిబ్బంది మాత్రం 8.9, 9.2గా చూపించి వారికి అసలు ధరకన్నా తక్కువగా ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలు పత్తిపైన రూ.150 నుంచి 200 వరకు నష్టపోతున్నారు. తేమశాతం విషయంలో సీసీఐ సిబ్బందిని ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే తీసుకురండి, లేకుంటే లేదు అనే దురుసుగా సమాధానం చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమే పలుమార్లు రైతులకు, సిబ్బందికి గొడవలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. అదే దళారులకు చెందిన పత్తి నీళ్లు కొట్టి తెచ్చినప్పటికీ వారి ఇచ్చే ముడుపులు సేకరించి వారికి సరైన ధర అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా అనేక రకాలుగా పత్తిరైతులు మోసపోతూ నష్టపోతున్నారు. ఇదంతా కొనసాగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. బుధవారం క్రిస్మస్ సెలవు ఉన్నప్పటికీ దళారులకు చెందిన పత్తి మిల్లులో ఖాళీ అవ్వడం కొసమెరుపు. ఈవిషయంపై కలెక్టర్ స్థాయి అధికారులు పట్టించుకొని విచారణ చేపడితే దళారుల దందా బయటపడే అవకాశం ఉంది.

లారీలు, డీసీఎంల్లో దళారులు తరలిస్తున్న పత్తి